క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌గా ఉమ

సదాశివపేట(సంగారెడ్డి): మున్సిపల్ కమిషనర్‌గా ఉమ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా పనిచేసిన ఉమా సదాశివపేట మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన శ్రీనివాస్‌రెడ్డి జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కమిషనర్ ఉమ మాట్లాడుతూ మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఉర్సు ఉత్సవాలు ప్రారంభం

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ గ్రామ శివారులోని ఉర్సెషరీఫ్ ఫీర్‌గైబ్ సాహెబ్ ఉర్సు ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు దర్గాలో ప్రజలు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ

మనూరు(నారాయణఖేడ్): మనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు వారి తల్లిదండ్రులకు శుక్రవారం పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల క్రమశిక్షణ, సమాజం పట్ల ఉండాల్సిన శ్రద్ధ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం యాదగిరి, ఉపాధ్యాయులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అగ్రిటెక్ ఎగ్జిబిషన్‌కు తరలిన రైతులు



ఎగ్జిబిషన్ సందర్శించేందుకు తరలివెళ్తున్న రైతులు

నారాయణఖేడ్: రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన అగ్రిటెక్ ఎగ్జిబిషన్‌ను సందర్శించేందుకు వ్యవసాయశాఖ ఆత్మ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఖేడ్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయరంగ నిపుణులు సాగులో మెలకువలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎగ్జిబిషన్‌కు తరలివెళ్లిన వారిలో ఆత్మ బీటీఎం మారుతిరెడ్డి, రైతులు శేఖర్‌రెడ్డి, బాబురావు, సాయిరెడ్డి, వెంకట్, నర్సింహులు, అంజిరెడ్డి, మనోహర్‌రావు, విఠల్, తుకారాం, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అభివృద్ధిలో పరిశ్రమల సహకారం అవసరం



మున్సిపల్ చైర్‌పర్సన్‌కు ట్రాక్టర్ తాళాలను అందజేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

జిన్నారం(పటాన్‌చెరు): మున్సిపాలిటీ అభివృద్ధిలో పరిశ్రమల సహకారం అవసరమని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. బొల్లారం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమ యాజమాన్యం సీఎస్ఆర్ నిధుల ద్వారా చెత్త సేకరణ ట్రాక్టర్‌ను మున్సిపల్ కార్యాలయానికి అందించేందుకు ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా శుక్రవారం ట్రాక్టర్‌కు సంబంధించిన తాళాలను పరిశ్రమ ప్రతినిధులు మున్సిపల్ చైర్‌పర్సన్‌కు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చెత్త సేకరణకు ట్రాక్టర్‌ను అందించేందుకు యాజమాన్యం ముందుకురావడం హర్షణీయమన్నారు. మున్సిపల్ అభివృద్ధికి మరిన్ని పరిశ్రమలు ముందుకురావాలని సూచించారు. మున్సిపల్ మేనేజర్ నిర్మల, కార్యాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నందికంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వైద్య సిబ్బంది రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ అంజయ్య హాజరై మాట్లాడారు. సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ విద్యార్థులందరికీ అందజేస్తున్న రాగిజావ బెల్లంతో విద్యార్థులకు అనీమియా రాకుండా హిమోగ్లోబిన్ శాతం పెరిగిందన్నారు. విద్యార్థులు ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ గౌరీశంకర్, సంయుక్త, వరలక్ష్మి బృందం, ఉపాధ్యాయులు సీఆర్పీలు రాజేశ్వర్, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన శ్రీనివాస్‌రెడ్డి శు క్రవారం బాధ్యతలను స్వీకరించారు. కమిషనర్‌గా ఉన్న సుభాష్‌రావు హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో సదాశివపేట మున్సిపల్ కమిషనర్ జహీరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కేంద్ర విధానాలపై కన్నెర్ర

- కదం తొక్కిన కార్మిక లోకం
- దేశవ్యాప్త సమ్మె విజయవంతం

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో వివిధ రంగాల కార్మికులు శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లు, రైతు వ్యతిరేక నల్లచట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



జహీరాబాద్ టౌన్: మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్



పటాన్‌చెరు టౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు



హత్నూర: దౌల్తాబాద్ చౌరస్తాలో ఆందోళన నిర్వహిస్తున్న ఆటో కార్మికుల



జోగిపేట: ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు



జిన్నారం: బొల్లారంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు



మునిపల్లి: బుదేరా చౌరస్తాలో నిరసన తెలుపుతున్న, నాయకులు, కార్మికులు



నారాయణఖేడ్: సమ్మెలో పాల్గొన్న వివిధ రంగాల కార్మికులు, ఉద్యోగులు

విద్యార్థినులకు మోటివేషనల్ క్లాసులు

జహీరాబాద్: మండల పరిధిలోని రంజోల్ గ్రామంలో ఉన్న సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాల విద్యార్థినులకు ఇంపాక్టు సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మోటివేషనల్ క్లాసులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ ప్రతినిధులు రాజేశ్వర్, నర్సింహచారి, సనా ఫాతిమాలు ప్రత్యేక అతిథులుగా హాజరై విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పరీక్షలు అంటే భయపడకుండా ధైర్యంతో ముందుకెళ్లాలని, ప్రతిదీ పాజిటీవ్‌గా ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లలితమ్మ, సూపరింటెండెంట్ గంగాధర్ పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఇంఫాక్ట్ ప్రతినిధులు

క్యాలెండర్ ఆవిష్కరణ

నారాయణఖేడ్: పోలీసు సర్కిల్ కార్యాలయంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో మహనీయుల చిత్రాలతో ముద్రించిన 2024 సంవత్సర క్యాలెండర్లను ఆ సంఘం నాయకులతో కలిసి సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెలమాణిక్, ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షులు కాన్షీరాం, కేవీపీఎస్, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ నాయకులు బాబురావు, సతీష్, పవన్, సంగారెడ్డి, మునీర్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఆటోడ్రైవర్లు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని కానుకుంటలో ఆటో డ్రైవర్‌లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంతో ఉపాధి కరువైందని, తమను ఆదుకునేలా ప్రభుత్వం నెలకు రూ.15వేల జీవనభృతి చెల్లించాలన్నారు. ఆటోడ్రైవర్‌ల సంఘం నాయకులు వెంకటేశ్, రాజు, మల్లేశ్, యాదగిరి పాల్గొన్నారు.

పుష్కరిణిలో చక్రస్నానోత్సవం

సంగారెడ్డి పట్టణ శివారులోని వైకుంఠపురం దేవాలయ 11వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా దేవాలయ ఆవరణలోని పుష్కరిణిలో వేంకటేశ్వర స్వామికి చక్రస్నానోత్సవాన్ని, అర్చకులు వరదాచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్యన ఘనంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామికి చక్రస్నానం చేయిస్తున్న భక్తులు

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

ఎన్‌ఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఎన్‌ఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. నీలం మధు కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా శుక్రవారం చిట్కుల్ గ్రామంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేవిధంగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నీలం మధును కలిసిన నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఎన్‌ఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు నీలం మధును మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నీలం మధు ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.



నీలం మధును సన్మానించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

మోదీ పాలనలో పేదోడిపై ధరల భారం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

సంగారెడ్డి టౌన్: 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలవడానికి చెప్పుకోదగ్గ అభివృద్ధి ఏమీ లేకపోవడంతో మరోసారి అధికారం కోసం మత విభజన పేరుతో ప్రజల ముందుకు వస్తుందని, మోదీ పాలనలో ప్రజలపై గుదిబండగా ధరలు పెరిగాయని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం పీఎస్ఆర్ గార్డెన్ లో సభ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్దకు చేరుకొని అన్ని సంఘాలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని లూటీ చేస్తున్న కార్పొరేట్ అధిపతులపై మాత్రమే మోదీకి ప్రేమ ఉందన్నారు. కార్పొరేట్ శక్తులకు మేలు చేసేందుకే కార్మిక చట్టాలను మారుస్తూ పని గంటలు పెంచుతున్నారని విమర్శించారు. ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై నోరెత్తితే దేశ ద్రోహం కేసులు నమోదు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారు. గనులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఇష్టారీతిగా దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. పేదలు, కార్మికులు, రైతు కూలీలకు కనీస వేతనాలు ఎందుకు పెంచడం లేదన్నారు. ఢిల్లీలో రైతులపై నిర్బంధాన్ని మోపడం సరికాదని హెచ్చరించారు. ధర్నాకు కాంగ్రెస్, సీపీఎం, టీజేఎస్ నేతలు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు తుల్జా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



అందోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో...

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కలెక్టర్‌గా స్వప్న, డీఈఓగా నాగరాజ్, ఎంఈఓగా సందీప్‌కుమార్, హెచ్‌ఎంగా మౌనిక వ్యవహరించారు. ఈసందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం శైలజకులకర్ణి, ఉపాధ్యాయులు మోహన్, రాజయ్య, మశ్చేందర్, సంజీవ్‌కుమార్, శ్రీనివాస్, మురళిగౌడ్, పీఈటీ సంగ్రామ్ పాల్గొన్నారు.

అందోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో...

జోగిపేట(అందోల్): ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా ప్రియాంక, డీఈఓగా అస్మినా బేగం, డిప్యూటీ ఈవోగా యశ్వంత్, ఎంఇఓగా శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా నాజ్లిన్‌బేగం వ్యవహరించారు. పీఈటీలుగా శివకుమార్, అభినయ్, యశ్వంత్, నీరజలు వ్యవహరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేవిదాస్, ఉపాధ్యాయులు మాణయ్య, రమేశ్, అబ్దుల్ అజీమ్, శ్రీనివాస్, సాయిలు, కొండల్, నవీన, గీతాకుమారి, సరిత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పలుగు పోచమ్మ ఆలయ కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల**

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని షేర్‌ఖాన్‌పల్లి గ్రామ శివారులోని పలుకుమీది నల్ల పోచమ్మ ఆలయ పాలక మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఆలయ ఈవో శశిధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ ధర్మకర్తల ఎన్నిక కోసం దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనరేట్‌లో నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి 20 రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

◆ **సిద్ధివినాయక ఆలయంలో పూజలు**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ శివారులోని సిద్ధివినాయక ఆలయంలో కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రెండు రోజుల పాటు ఇక్కడే ఉండి భక్తులకు ప్రవచనాలను ఇవ్వనున్నట్లు ఆలయ ట్రస్టు సభ్యులు తెలిపారు.

◆ **కాంగ్రెస్‌లో చేరిక**

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల పరిధిలోని అన్నారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఎంపీటీసీ లక్ష్మి శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు మద్ది వీరారెడ్డి, చంద్రారెడ్డి, మద్ది ప్రతాప్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **లింకు రోడ్డు పనులు ప్రారంభం**

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని ఖమ్మంపల్లి నుంచి పెద్దచల్మెడకు లింకు, మెటల్ రోడ్డు పనులను మాజీ ఎంపీపీ రాంరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ లింకు రోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలని మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లగా లింకు రోడ్ల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్, సంగమేశ్వర్, గుడ్డు పటేల్ పాల్గొన్నారు.

◆ **వైభవంగా శివపార్వతుల కల్యాణం**

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని దౌల్తాబాద్ భవాని స్ఫటిక లింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శివపార్వతుల కల్యాణోత్సవాన్ని శుక్రవారం కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ వృద్ధురాభిషేకం తదితర ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం వాచిబండ్ల ఊరేగింపు పల్లకీసేవను ఘనంగా నిర్వహించారు.

◆ **జోగినాథ రథానికి పూజలు**

జోగిపేట(అందోల్): రథసప్తమి సందర్భంగా జోగిపేటలోని జోగినాథ ఆలయానికి చెందిన రథానికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రథోత్సవ కమిటీ అధ్యక్షుడు శివశంకర్, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కౌన్సిలర్ సురేందర్‌గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ నాగభూషణం, మాజీ ఎంపీపీ రామాగౌడ్, రథోత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా రథ సప్తమి**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని పంచవటి క్షేత్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వసంత పంచమి ఉత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా రథసప్తమిని పురస్కరించుకొని సూర్య భగవానుడి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు, యజ్ఞాలు నిర్వహించారు. సమీపంలోని మంజీర నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు.

◆ **సన్మానం**

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన భిక్షపతి, ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన అరుణలను ఎంపీపీ రవీందర్‌గౌడ్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులకు తాము అందుబాటులో ఉంటూ సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వడ్డెకృష్ణ, పల్మాటి భాస్కర్ పాల్గొన్నారు.

◆ **పటాన్‌చెరు ఎక్సైజ్ సీఐగా పరమేశ్వర్‌గౌడ్**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎక్సైజ్ సీఐగా పరమేశ్వర్‌గౌడ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నాగర్ కర్నూల్ జిల్లా టాస్క్‌ఫోర్స్‌లో సీఐగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై వచ్చారు. ఇంతకుముందు ఇక్కడ ఎక్సైజ్ సీఐగా విధులు నిర్వహించిన సీతారామిరెడ్డి బదిలీపై ఇబ్రహీంపట్నం వెళ్లారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్‌షాపులు, గంజాయి విక్రయాలపై తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

◆ **ఘనంగా రథోత్సవం**

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని సింగూరు ప్రాజెక్టులో వెలిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను రెండు రోజుల నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం స్వామివారి కల్యాణం నిర్వహించగా శుక్రవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు, రథోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో సింగూరు పరిసర గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

◆ **సమస్యల పరిష్కారానికి కృషి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. బస్తీదర్శన్ కార్యక్రమంలో భాగంగా శ్రీనివాస్‌నగర్ కాలనీలో శుక్రవారం పర్యటించారు. ఆమె వెంట స్థానిక నాయకులు, కాలనీవాసులు ఉన్నారు.

◆ **కల్హేర్ తహసీల్దార్‌గా రాజగణేష్**

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ తహసీల్దార్ రాజగణేష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన బాలశంకర్ కోహిర్ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. నిజాంపేట తహసీల్దార్ రాజగణేష్‌ను కల్హేర్ తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సర్వేయర్ సునీత, సిబ్బంది నరేష్, రవి, సాయి, డేవిడ్, రాజు, ఆనంద్, తహసీల్దార్లు రాజగణేష్, బాలశంకర్‌ను ఘనంగా సన్మానించారు.

◆ **కోహీర్ తహసీల్దార్‌గా బాలశంకర్**

కోహీర్(జహీరాబాద్): తహసీల్దార్‌గా బాలశంకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కల్హేర్ తహసీల్దారుగా విధులు నిర్వహించిన ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. కోహీర్ తహసీల్దారుగా పనిచేసిన శాంతకుమారి సంగారెడ్డి డీఏఓగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బాలశంకర్‌ను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

◆ **సీపీఎస్ విధానం రద్దు చేయాలి**

సంగారెడ్డి టౌన్: సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీఎన్జీవో అధ్యక్షుడు జావిద్‌అలీ అన్నారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట టీఎన్జీవో ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన సమయంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

◆ **పటాన్‌చెరు తహసీల్దార్‌గా రంగారావు**

పటాన్‌చెరు టౌన్: తహసీల్దార్‌గా రంగారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సూర్యాపేట జిల్లా చివేముల నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ భాస్కర్ నారాయణఖేడ్‌కు బదిలీపై వెళ్లారు.

◆ **డ్రైవర్లకు అవగాహన**

జహీరాబాద్: జహీరాబాద్‌లోని మహీంద్ర కర్మాగారం వద్ద ఉన్న పాఠశాలలో రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహీంద్ర లాజిస్టిక్, ఎల్అండ్‌టీ, మ్యాగ్మో వెల్ఫేర్ సంస్థల ప్రతినిధులు చేతన్, విజయ్‌పవార్, రాజేష్ కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.

◆ **వినతిపత్రం అందజేత**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నూతనంగా బాధ్యతలు చేపట్టిన తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డిని ఉస్మాన్‌నగర్ మాజీ ఉపసర్పంచ్ శ్యామ్‌రావు ఆధ్వర్యంలో బీడీఎల్ అపార్ట్‌మెంట్ నివాసులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంగారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

◆ **ఎంప్లాయిమెంట్ కార్డులు తీసుకోవాలి**

సంగారెడ్డి టౌన్: నిరుద్యోగులు ఎంప్లాయిమెంట్ కార్డులు తీసుకోవాలని జిల్లా ఉపాధి శాఖ అధికారి వందన అన్నారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో ఏర్పాటుచేసిన ఉపాధి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఎంప్లాయిమెంట్ కార్డులు తీసుకోవాలని ఏపీపీసీ హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధి శిక్షణ నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వశాఖ సంకల్ప పథకంలో భాగంగా శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. డిస్ట్రిక్ ఇండస్ట్రియల్ ఐపీఓ సుమన్ ప్రియాంక, ఏపీపీఎస్సీ ప్రతినిధులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

◆ **సంగారెడ్డి తహసీల్దార్‌గా దేవదాసు**

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి తహసీల్దార్‌గా దేవదాసు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ బదిలీపై హత్నూర వెళ్లారు.

◆ **మతిస్థిమితం కోల్పోయిన మహిళ అదృశ్యం**

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన అగుల్ల సరిత మతిస్థిమితం కోల్పోయి తప్పిపోయినట్లు పట్టణ సీఐ శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతినగర్‌కు చెందిన సరిత భర్త రవి గురువారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో తన తండ్రి కుమారస్వామితో కలిసి సంగారెడ్డి పట్టణంలోని ఎస్‌బీఐలో పింఛన్ డబ్బుల కోసం వచ్చారు. అనంతరం డబ్బులు తీసుకున్న తర్వాత ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో సంగారెడ్డి కొత్త బస్టాండ్ సమీపంలో సరిత కనిపించకుండా పోయిందని కుమారస్వామి తెలిపాడు. దీంతో ఆమె కోసం కుటుంబీకులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో సరిత భర్త రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 08455276333 నెంబర్ సమాచారం ఇవ్వాలని సూచించారు.

◆ **అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలను కలిసిన సీఐ, ఎస్ఐలు**

జోగిపేట(అందోల్): సంగారెడ్డి జిల్లా అడిషనల్ ఎస్పీ సంజీవరావు, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యను జోగిపేట సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ కలిసి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

◆ **జీఓ రద్దు చేయొద్దని వినతి**

జహీరాబాద్: జీఓ 1996ను రద్దు చేయవద్దని భవన, ఇతర నిర్మాణరంగ ట్రేడ్ యూనియన్ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో ఆయా రంగాలకు చెందిన కార్మికులు 47 శాతం మేర ఉన్నారన్నారు. ప్రస్తుతం ఉన్న జీఓ రద్దు చేస్తే తమకు తీరని అన్యాయం జరుగుతుందని వాపోయారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని 1996 జీఓ రద్దు చేయవద్దంటూ వినతిపత్రంలో కోరారు.